పిడుగుపాటు.. వీడాలి ఏమరుపాటు!



- వాతావరణంలో మార్పులతో అకాల వర్షాలు
- పిడుగు పాటుకు జీవాలతో పాటు మనుషులు మృతి
- ఉమ్మడి జిల్లాలో నెల రోజుల వ్యవధిలోనే ఏడుగురు మృతి
- పలువురికి గాయాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు, నిపుణులు

క్రికెట్ ఆడేందుకు వెళ్లి...

ఏప్రిల్ 23వ తేదీన కౌతాళం మండలం కాత్రి గ్రామానికి చెందిన అశోక్, బాలయ్య, నిరుపాది, గంగాధర్‌లతో పాటు మరో ఆరుగురు గ్రామ శివారులోని పొలాల్లో క్రికెట్ ఆడుతున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు జరిగి ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది. అదే సమయంలో క్రికెట్ ఆడుతున్న ప్రాంతానికి సమీపంలో పిడుగు పడింది. ఈ ఘటనలో అశోక్, బాలయ్య తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోగా.. మిగతావారు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

పొలానికి నీళ్లు కడుతూ..

గతనెల 27న నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన యువ కౌలు రైతు రంగడు తన తండ్రితో కలిసి పొలానికి నీళ్లు కడుతున్నాడు. ఆకస్మాత్తుగా వర్షం రావడంతో పాటు పొలానికి సమీపంలో పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే రంగడు మృతి చెందాడు.

విలువైన మూగజీవాలు మృత్యువాత

గతనెల 28న పెద్దకడుబూరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన చిన్న మాదన్న ఊరి శివారు పొలంలో ఎద్దులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడం, ఉరుములు, మెరుపులతో వచ్చిన పిడుగు ఎద్దులపై పడటంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో బాధిత రైతుకు రూ.1.80 లక్షల నష్టం వాటిల్లింది.

నంద్యాల(అర్బన్): వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవిలోనూ ఉరుములతో కూడిన వర్షం కురవడం, పిడుగులు పడటం జరుగుతోంది. ఆ సమయంలో వివిధ పనుల మీద బయటకు వెళ్లిన వారి రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల కాలంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో పిడుగుపాటుకు గురై ఏడుగురు మృతి చెందగా....పలువురు గాయాలపాలయ్యారు. మూగజీవాల మృత్యువాత గురించి చెప్పనక్కర లేదు. ఈ నేపథ్యంలో చిన్న పాటి జాగ్రత్తలతో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అధికారులు, నిపుణులు చెబుతున్నారు.

పిడుగు అంటే...

పిడుగు అంటే ఆకాశంలో సహజసిద్ధంగా ఉత్పన్నమయ్యే విద్యుదాపాతం. మేఘాలు ఢీకొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుపు అని, శబ్దాన్ని ఉరుము అని, ఉత్పన్నమయ్యే విద్యుత్‌ను పిడుగుగా భావిస్తారు. మేఘాల్లో అతిశీతల రేణువులు విద్యుదావేశాలను జనింపజేస్తాయి. మేఘాల దిగువభాగంలోని రుణవిద్యుత్ ఆవేశాలు భూమిపై ధన విద్యుదావేశాన్ని ప్రేరేపిస్తాయి. ఈ రెండు విద్యుదావేశాలు అనుసంధానమైప్పుడు విద్యుత్‌శక్తి ఉత్పన్నమవుతుంది. దీన్నే పిడుగు అంటారు. ఒక్క పిడుగుకు కొన్ని కోట్ల వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పిడుగు మనిషిని నేరుగా తాకితే అక్కడికక్కడే బూడిదైపోవడం ఖాయం.

సమయస్ఫూర్తి అవసరం

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలు కాకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవడం వలన సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అన్పించినప్పుడు రబ్బర్ చెప్పులు ధరించడం మంచిది. ఒక వేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా ఆనించకుండా, కాలి వేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు అధిక నష్టం

పిడుగుపడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువ నష్టం జరిగే అవకాశముంటుంది. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించక పోవడం ఉత్తమం. అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయరాదు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎత్తయిన చెట్లు, సెల్ టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు ఉపయోగించరాదు.
- వర్షం కురిసినప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉరుములతో కూడిన వర్షం వస్తున్నప్పుడు నీటితో కూడిన పనులు చేయరాదు.
- గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి. ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయరాదు.

మైదాన ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఎక్కువ



పిడుగుపాటు మరణాలు సాధారణంగా మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వ్యవసాయ పనుల్లో ఉన్న వారు అందరూ ఒకే చోట గుంపుగా ఉండకూడదు. గొడుగులు వాడకూడదు. చేతిలో పలుగు, పార లాంటి ఇనుప వస్తువులు ఏవీ ఉండకూడదు. సెల్‌ఫోన్లో మాట్లాడటం, కెమెరా ద్వారా ఫొటోలు తీయడం మంచిది కాదు. ఉరుముల సమయంలో పాత్రలు కడగడం, స్నానం చేయడం మంచిదికాదు. ఇళ్లపై పిడుగు పడడం చాలా అరుదుగా ఉంటుంది. పిడుగు బారి నుంచి తప్పించుకునేందుకు నివాస గృహాలే మేలు. – **రాజశేఖర్, ఏడీఏ, నంద్యాల**

ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి



మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిడుగుపాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు సాధ్యమైనంత తొందరగా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. పిడుగు ప్రభావంతో లక్షల సెంటీగ్రేడ్లతో ఉత్పత్తి అయ్యే వేడి మనుషులపై పడితే తక్షణం గుండెపై ప్రభావం చూపుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల్లో, ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ఉండకూడదు. –**అశోక్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్, అగ్రానమి, ఆర్ఏఆర్ఎస్ నంద్యాల**

క్లుప్తంగా

కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గోస్పాడు: కౌలు రైతులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో వీఆర్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గుర్తింపు కార్డులతో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట నష్టం పరిహారం పొందడానికి వీలవుతుందన్నారు. అవసరమైన వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి సమస్యలను పరిష్కరించాలి



నంద్యాల ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గోస్పాడు: జిల్లా జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటీ స్కానింగ్ యంత్రం గత వారం రోజులుగా పని చేయడం లేదని తెలిపారు. వెంటిలేటర్‌తో కూడిన 108 అంబులెన్స్ సర్వీస్ లేదన్నారు. రేడియాలజీకి సంబంధించిన వైద్యుల నియామకం జరగలేదన్నారు. స్థానికంగా మంత్రి ఫరూక్ ఉన్నప్పటికీ ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు నరసింహులు, మహమ్మద్ గౌస్, వెంకటలింగం, మౌలాలి, జైలాన్ పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సంఘ కాపరి విజయభాస్కర్

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని, దీని ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బర్మాశాల తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి రెవ విజయభాస్కర్ అన్నారు. సోమవారం బర్మాశాలలో నూతన మందిరాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. మొదటగా ప్రత్యేక ప్రార్థనలతో గుడి చుట్టు ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం సంఘకాపరితో పాటు ముఖ్యఅతిథి సత్య ప్రకాశానంద చర్చిని ప్రారంభించి మాట్లాడారు. క్రైస్తవులు ఇతరుల పట్ల విశ్వాసం, నమ్మకం, ప్రేమ, అనురాగం కలిగి జీవించాలన్నారు.

ఎస్టీయూ మాజీ అధ్యక్షుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

చాగలమర్రి: ఉమ్మడి కర్నూల్ జిల్లా ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు, డి.వనిపెంట, చెంచుగూడెం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు పి.ప్రసాద్ (58) మృతి చెందారు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ వీరభద్రుడు, ఎంఈఓలు అనురాధ, సయ్యద్ న్యామతుల్లా, హెచ్ఎంలు ఐడీకే శాస్త్రి, విజయలక్ష్మి, ఎస్టీయూ, పీఆర్‌టీయు నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీకాంత్‌కు ఉత్తమ అవార్డు

నంద్యాల(వ్యవసాయం): జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలకు వచ్చే వందలాదిమంది రోగుల సహాయకులకు సేవా దృక్పథంతో ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి భోజనం, వసతి కల్పిస్తున్న నంద్యాల సేవా ప్రగతి లయన్స్ క్లబ్ పీఎంజేఎఫ్ పెసల శ్రీకాంత్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా అవార్డు లభించింది. మల్టీపుల్ డిస్ట్రిక్ట్ (316) బెస్ట్ రిలీవింగ్ ది హంగర్ ప్రోగ్రాం 2024–25 కింద ఎంపిక చేసి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగ అవార్డు అందించినట్లు శ్రీకాంత్ వెల్లడించారు.

మల్లన్నకు సోమవార సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సోమవార సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి

నంద్యాల (వ్యవసాయం): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎంయూఏ నాయకులు ఆర్‌డీఓ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 1/2019 సర్క్యులర్ అమలుతో పాటు నైట్ సర్వీస్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400 పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓను కలిసిన వారిలో నాయకులు సుబ్బరాజులు యోగరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నందీశ్వరుడు శివరాం, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణకు సంబంధించిన కమిషన్‌ను తక్షణమే నియమించాలని, అలాగే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావు, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 11వ పీఆర్సీ ముగిసి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు 12వ పీఆర్సీ ఏర్పాటు చేయలేదన్నారు.

1వ వార్డులో వాటర్ ట్యాంక్ ప్రారంభించాలి

నంద్యాల(అర్బన్): మాదిగలు అధికంగా నివసించే ఒకటో వార్డులో తాగునీటి సమస్య వేధిస్తోందని, అక్కడ వెంటనే అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితులు నివసించే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సోమవారం వారు ఒకటో వార్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ మాదిగ, మాతాంగి మల్లయ్య, సాయిమాదిగ పాల్గొన్నారు.

శ్రీవాసవీ మాతకు మహాకుంభాభిషేకం





ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత, కలశాలు తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంతిని పురస్కరించుకొని నూనెపల్లెలోని అమ్మవారి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం, ఘట్టాభిషేకం మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న చెరువు దగ్గర నుంచి ఉదయం 1500 కలశాలతో గంగా జలాన్ని ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానం వరకు తీసుకెళ్లారు. అక్కడ ఆలయ గోపురానికి మహాకుంభాభిషేకం , సహస్రఘట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి వజ్రాల చీరతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మహామంగళ హారతులిచ్చి తీర్థప్రసాదలు అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనమివ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనంగా రూ.35వేలు ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, నంద్యాల కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం కార్యదర్శి రంజిత్, మెడికల్ ఎంప్లాయిస్ అధ్యక్షురాలు సుశీలమ్మ, భూమిని శ్రీనివాసులు, మరియమ్మ, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

- రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘం కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలో హైపవర్ గ్రీడ్ ఏర్పాటుతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు.

జొన్నల కొనుగోళ్లలో నిర్లక్ష్యం సరికాదు

నంద్యాల(అర్బన్): రైతుల నుంచి జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. రైతులను చులకనగా చూడొద్దని సకాలంలో వారి పండించిన పంటకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పంట వచ్చిన రెండు నెలల తర్వాత కొనుగోలు నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సీమ రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదన్నారు. మూడు నెలల తర్వాత కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా జొన్నలను సేకరించడం లేదన్నారు. గోదాములకు తీసుకొని వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేయకుండా రోజుల తరబడి నిలిపి వేస్తున్నారన్నారు. ఈ చర్యలతో రైతులు గోదాముల దగ్గరే నిద్రహారాలు మాని కాపలా ఉండాల్సి వస్తుందన్నారు. రైతులకు శారీరక అలసటతో పాటు వాహనాల కిరాయి పెరిగి ఆర్థిక భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో ధాన్యాన్ని సజావుగా సేకరిస్తున్న ప్రభుత్వం సీమలో జొన్నల సేకరణ పట్ల పూర్తి ఉదాసీనంగా వ్యవహరించడం అన్యాయమన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, అధ్యక్షుడు బాజీపఠాన్ మాట్లాడుతూ పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం పాటించి విజయవాడలో పెన్షన్ మార్చ్ చేపడుతామని పేర్కొన్నారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సీపీఎస్‌ఈఏ నాయకులు రామనరసింహ, మద్దయ్య, వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఆకలితో ఉన్నవారికి అన్నం పెడితే మహా పుణ్యమని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగన్న అన్నారు. ఆ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించి 1250 రోజులు పూర్తి అయింది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని భావించి ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరిస్తున్న సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూ ఫిర్యాదులపై దృష్టి సారించండి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలలో రెవెన్యూ శాఖకు సంబంధించినవే అధికంగా ఉన్నాయన్నారు. తాజాగా 77 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని చెప్పారు. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

పీ4 సర్వే ద్వారా గుర్తించిన పేద కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం పేదరికం నిర్మూలనకు పీ 4 (ప్రజా–ప్రైవేట్–ప్రజల భాగస్వామ్యం) సర్వే చేపట్టిందన్నారు. దీని ద్వారా మండలాల వారీగా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని చేయూత నిచ్చేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు.అలాగే ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు ఇవ్వాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో గత ఏడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరం 19 శాతం అదనంగా రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 26,139 మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారిలో ఇప్పటివరకు 12,651 మందికి మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగలు

ఉయ్యాలవాడ : భానుడు భగ భగ మండుతున్నాడు. ఉదయం 9గంటలు దాటితే ఎండ తీవ్రతకు జనం బయటకు రాలేకపోతున్నారు. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రతకు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరో వైపు చిన్నారులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నదులు, బావులు, కుంటల్లో ఈతకొడుతూ సరదాగా గడుపుతున్నారు. వృద్ధులు గృహాల్లో ఉండలేక చెట్ల కింద సేదతీరుతున్నారు. మండలంలో గత రెండు రోజుల నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది.



ఉయ్యాలవాడలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి



గోవిందపల్లెలో వేసవితాపం తాళలేక బావిలో ఈత కొడుతున్న చిన్నారులు

20న దేశ వ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అన్ని సంఘాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు బాల వెంకట్, మిట్నాల తిరుపతయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు



డి.వనిపెంట గ్రామంలో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

చాగలమర్రి: సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోవడం లేదు. సోమవారం మండల పరిధిలోని డి.వనిపెంట, ఓ.జి తండా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడగా, చెంచుగూడెం అంగన్‌వాడీ కేంద్రం తెరచినా ఒక్క చిన్నారి కూడా లేక పోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు కేంద్రం నిర్వహించాలి. సిబ్బంది మాత్రం మధ్యాహ్నం 3.30 గంటల వరకు విధుల్లో ఉండాలి. అయితే, పలు కేంద్రాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. దీంతో కేంద్రాల ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యం నీరుగారిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.